క్లుప్తంగా

చిగుళ్ల వ్యాధులపై అవగాహన అవసరం

బోట్‌క్లబ్‌: చిగుళ్ల వ్యాధిపై అవగాహన అవసరమని ప్రముఖ దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక ఓ వైద్యశాలలో ఆదివారం ప్రపంచ చిగురు ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నోటి దుర్వాసన, చిగుళ్ల వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిగుళ్ల వ్యాధుల వల్ల కలిగే అనారోగ్యాలను సూచించే పోస్టర్‌ ని ఆవిష్కరించారు. అనంతరం నాగేంద్ర, ఏఎస్‌ మూర్తి, అడ్డాల సత్యనారాయణ సలభై మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి, గమ్‌ పెయింట్లు, మౌత్‌ వాష్‌ లు అందచేశారు.

ఘనంగా శంకర జయంతి



పంచారామ క్షేత్రంలో పూజలు చేస్తున్న పండితులు

సామర్లకోట: దేవదాయశాఖ ఆదేశాల మేరకు ఆదివారం శంకర జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వరస్వామి ఆలయంలో నంది మండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై జయంతి వేడుకలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు వినయ్‌ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు పండ్లు ప్రసాదంగా అందజేశారు.

సిరాపై వదంతుల్ని నమ్మొద్దు

జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్‌ఓ రామ్‌సుందర్‌రెడ్డి

పిఠాపురం: ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్లకు వేసే చెరగని సిరా ఇతరులకు అందుబాటులో ఉందంటూ సోషల్‌ మీడియాలో వస్తున్నవన్నీ వదంతులేనని, వాటిని నమ్మొద్దని జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఆర్‌ఓ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. ఆయన పిఠాపురంలో విలేకర్లతో మాట్లాడుతూ చెరగని సిరా ద్వారా ఓటర్ల వేళ్లపై మార్కు చేస్తూ ఓటు హక్కును వారు వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర జరుగుతోందని సోషల్‌ మీడియాలో వస్తున్న దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. చెరగని సిరా ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే ఉంటుందన్నారు. ఇతరులెవరి వద్ద అందుబాటులో ఉండదన్నారు. ఇతరుల దగ్గర ఈ సిరా అందుబాటులో ఉందని చేస్తున్న ప్రచారాల్లో ఎటువంటి నిజం లేదన్నారు. ఎవరైనా ఇతర సిరాను ఉపయోగించి చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఒక వేళ ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

నూకాలమ్మ తల్లి దర్శనానికి పోటెత్తిన భక్తులు



నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు బారులు తీరారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతరలో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్‌ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సీఐ రవికుమార్‌ పర్యవేక్షణలో ఎస్‌ఐ వెలుగుల సురేష్‌ ఎటువంటి పోలీస్‌ బందోబస్తు కల్పించారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఓటుకు వేళాయె..

- నేడు సార్వత్రిక ఎన్నికల సంగ్రామం
- కాకినాడ రూరల్‌ నియోజకవర్గంలో సర్వం సిద్ధం
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆర్వో వెంకటరావు



అచ్చంపేట జంక్షన్‌లోని నన్నయ పీజీ సెంటరు వద్ద డిస్ట్రిబ్యూషన్‌ సెంటరు నుంచి బయలుదేరుతున్న పోలింగ్‌ సిబ్బంది

కాకినాడ రూరల్‌: 2024 ఎన్నికల సంగ్రామంలో ఓటరు తన అభిప్రాయాన్ని చెప్పే మహత్తరమైన రోజు రానే వచ్చేసింది. తన వజ్రాయుధంతో ఎవరిని అందలం ఎక్కిస్తాడో అని అభ్యర్థులంతా ఆశగా చూస్తున్నారు. సోమవారం జరగనున్న పోలింగ్‌కు కాకినాడ రూరల్‌ నియోజకవర్గంలో అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి ఇట్ల కిశోర్‌ ఆధ్వర్యంలో తిమ్మాపురం గ్రామ పరిధిలోని అచ్చంపేట జంక్షన్‌ వద్ద నన్నయ యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్‌ సెంటరు నుంచి ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం నుంచి వారికి కేటాయించిన పోలింగ్‌ కేంద్రాలకు పయనమయ్యారు. నియోజకవర్గ పరిధిలో కాకినాడ రూరల్‌, కరప మండలాలలో పాటు కాకినాడ అర్బన్‌లోని 8 డివిజన్లకు ప్రజలు ఓటర్లుగా ఉన్నారు. మొత్తం 264 పోలింగ్‌ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌ సాగుతుంది. పోలింగ్‌ అనంతరం ఈవీఎంలను జేఎన్‌టీయూకే మెకానికల్‌ ఇంజినీరింగ్‌ పీజీ బ్లాక్‌ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌ రూమ్‌లో భద్రపరచనున్నారు. ఓటర్లు ఇబ్బంది పడకుండా పోలింగ్‌ కేంద్రాలు వద్ద షామియానాలు ఏర్పాటు చేశారు. ఓటర్లు తమతో పాటు ఎన్నికల సంఘం అనుమతించిన 13 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపించవచ్చునని అధికారులు తెలిపారు.

సిటీ నియోజకవర్గంలో..

కాకినాడ సిటీ నియోజకవర్గంలో సోమవారం జరగనున్న ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. మెక్లారిన్‌ గ్రౌండ్స్‌లోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం నుంచి సుమారు 44 బస్సులలో 234 పోలింగ్‌ స్టేషన్లకు శనివారం సాయంత్రం ఎన్నికల సామాగ్రిని తరలించారు. ఈ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్‌.గణేష్‌, సిటీ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షించారు. ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్‌ సరళిని ప్రతి రెండు గంటలకు ఒకసారి వెల్లడిస్తామని చెప్పారు. అలాగే పోలింగ్‌ ప్రక్రియ పూర్తయ్యాక, ఈవీఎం, వీవీప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని జేఎన్‌టీయూకే సివిల్‌ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రానికి తరలిస్తామని చెప్పారు. ఈ మేరకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు.



నన్నయ పీజీ సెంటర్‌ డిస్ట్రిబ్యూషన్‌ సెంటరు వద్ద ఆర్వో కిశోర్‌తో ఎన్నికల సామగ్రి పంపిణీపై మాట్లాడుతున్న కలెక్టరు నివాస్‌

డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌ను పరిశీలించిన కలెక్టరు

కాకినాడ రూరల్‌: అచ్చంపేట జంక్షన్‌ వద్ద నన్నయ పీజీ సెంటరులో ఏర్పాటు చేసిన కాకినాడ రూరల్‌ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్‌ సెంటరును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు జె.నివాస్‌ ఆదివారం పరిశీలించారు. రూరల్‌ నియోజకవర్గ ఆర్వో ఇట్ల కిశోర్‌ పోలింగ్‌ సిబ్బందికి ఎన్నికల సామగ్రి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సిబ్బందికి భోజన వసతితో సదుపాయాలు కల్పించామన్నారు. డిస్ట్రిబ్యూషన్‌ సెంటర్‌ నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర సామగ్రితో కేటాయించిన పోలింగ్‌ కేంద్రాలకు చేరుకుని సోమవారం జరగనున్న పోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

వివరాలు	రూరల్‌	సిటీ
మొత్తం అభ్యర్థులు	15	15
మొత్తం ఓటర్లు	2,69,330	2,41,620
పురుషులు	1,33,475	1,15,559
మహిళలు	1,35,847	1,25,958
ఇతరులు	8	103
పోలింగ్‌ కేంద్రాలు	264	234
సిబ్బంది	2500	1700
వెబ్‌కాస్టింగ్‌ కేంద్రాలు	133	221
ఈవీఎంలు	264	234
బ్యాలెట్‌ యూనిట్లు	581	234
కంట్రోల్‌ యూనిట్లు	581	234
వీవీ ప్యాట్లు	644	234
సమస్యాత్మక కేంద్రాలు	33	40

ఓటరూ.. ఓటు వేయుమా!

- చైతన్యం కల్పిస్తూ మోడల్‌ పోలింగ్‌ స్టేషన్లు
- యువత, మహిళలు, దివ్యాంగుల కోసం ఏర్పాటు
- ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన అధికారులు



యువ ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన యువతరం పోలింగ్‌ కేంద్రం



మోడల్‌ పోలింగ్‌స్టేషన్‌ను పరిశీలనకు వస్తున్న ఆర్వో వెంకటరావు



పింక్‌ కాన్సెప్ట్‌తో ఏర్పాటైన మహిళా పోలింగ్‌ కేంద్రం

కాకినాడ: ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలియజెప్పి, ఓటర్లలో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా కాకినాడ సిటీలో మోడల్‌ పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. చక్కని సదుపాయాలతోపాటు పోలింగ్‌ స్టేషన్‌లోకి ఆహ్లాదకర వాతావరణంలోకి వెళ్లి ఓటు వేసేందుకు వీలుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధానంగా యువత, మహిళలు, దివ్యాంగులు లక్ష్యంగా ఏర్పాటైన ఆయా 'థీమ్‌' పోలింగ్‌ స్టేషన్లలో ఆ కేటగిరికి చెందిన ఉద్యోగులనే ఏర్పాటు చేయడం ద్వారా ఓటర్లను ఆలోచింపచేసేలా తీర్చిదిద్దారు. కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు వీటిని ఏర్పాటు చేశారు. ఈ మేరకు కాకినాడ జీపీటీ ఆవరణలోని పోలింగ్‌ స్టేషన్‌ను యువతరం పోలింగ్‌ స్టేషన్‌గా కేవలం యువకులతో తీర్చిదిద్దారు. 2024 ఎన్నికల్లో యువ ఓటర్లు అధికంగా నమోదైన నేపథ్యంలో వీరిలో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా ఇది ఏర్పాటైంది. అలాగే ఎల్విన్‌పేట అంబేడ్కర్‌ కమ్యూనిటీ హాలు వద్ద ప్రత్యేకంగా మహిళల కోసం పోలింగ్‌ కేంద్రం ఏర్పాటు చేసి మహిళా ఉద్యోగులను విధుల్లో నియమించారు. అలాగే ఎంఎస్‌ఎన్‌ చారిటీస్‌ వద్ద ఉన్న పోలింగ్‌ స్టేషన్‌ పరిధిలో దివ్యాంగుల కోసం వారితో పోలింగ్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక శారదాదేవి ఆలయ ప్రాంతంలో అన్ని వర్గాల కోసం మరో మోడల్‌ పోలింగ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రొటీన్‌ పోలింగ్‌ స్టేషన్లకు భిన్నంగా దీనిని తీర్చిదిద్దారు. ఆయా మోడల్‌ పోలింగ్‌ స్టేషన్లను ఆదివారం సాయంత్రం ఈఆర్వో వెంకటరావు సందర్శించి సదుపాయాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అహ్లాదకరమైన వాతావరణంలో ప్రజలు ఓటు వేయాలనే లక్ష్యంతో ఆయా వర్గాల్లో చైతన్యం కల్పించే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశామన్నారు.



సర్వాంగ సుందరంగా మోడల్‌ పోలింగ్‌ స్టేషన్‌



దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్‌ స్టేషన్‌

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



కాకినాడ వివేకానంద పార్కులో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పౌరసంక్షేమ సంఘం సభ్యులు

బోట్‌క్లబ్‌: స్థానిక వివేకానంద పార్కులో ఆదివారం ఓటు హక్కు వినియోగిద్దాం ప్రగతిని సాధిద్దాం నినాదాలతో పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కన్వీనర్‌ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ సోమవారం ఉదయం 7 గంటలు నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్‌ జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటల లోపు పోలింగ్‌ కేంద్రంలోకి వచ్చిన వారికి ఎన్ని గంటలైనా పోలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఒకరికి ఓటు వేయాలన్నారు. ఎవరూ నచ్చకుంటే ఈవీఎంలో చివరి బటన్‌గా ఉండే నోటాకు ఓటు వేయవచ్చన్నారు. పోలింగ్‌ శాతం పెంచాలని విజ్ఞప్తి చేశారు. మెక్లారిన్‌ స్కూల్‌ పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు ఊసా వెంకటేశ్వరరావు, లయన్స్‌ క్లబ్‌ నగర కార్యదర్శి ఇందుగుల ప్రసాద్‌ నాయుడు, జిల్లా యువజన సంఘాల ప్రతినిధులు బొంతు వంశీ, ముస్లిం వెల్ఫేర్‌ కమిటీ సభ్యులు రవికిరణ్‌ పాల్గొన్నారు.



ఎవరి ధీమా వారిది

- ఓటరు మనోగతంపై అభ్యర్థులు
- సంక్షేమ పథకాలే గెలిపిస్తాయంటున్న అధికార పార్టీ అభ్యర్థులు, నాయకులు

కరప: ఎంతో కాలంగా ఎదురుచూసిన ఎన్నికల రోజు రానేవచ్చింది. ఈరోజు కోసమే ఐదేళ్లుగా ఎదురుచూసిన పార్టీల నాయకులకు ఓటర్ల తీర్పుపై ఉత్కంఠత నెలకొంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా ఏపార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయో, ఎవరికి మెజార్టీ వచ్చే అవకాశం ఉందోనని చర్చించుకుంటున్నారు.

వైఎస్సార్‌ సీపీ, కూటమి అభ్యర్థుల మధ్యే పోటీ

కాకినాడ రూరల్‌ నియోజకవర్గంలో ప్రధానంగా వైఎస్సార్‌ సీపీ, కూటమి మధ్యే పోటీ ఉంటుందంటున్నారు. గత 2019 ఎన్నికల్లో రాష్ట్రచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 151 సీట్లతో వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి సీఎం అయ్యారు. పాలనలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చి, సంక్షేమ పథకాలతో జనరంజక పాలన అందించిన ఆయన పాలనను మళ్లీ ప్రజలు కోరుకుంటున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన కన్నబాబు ఆ హోదాతో పాటు మంత్రిగా నియోజకవర్గంలో సుమారు రూ.750 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేయించారు. 32 వేల మందికి ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చారు. అర్హులైనవారందరికీ వేలకోట్ల విలువైన సంక్షేమ పథకాలు అందించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మళ్లీ పోటీ చేస్తూ ఐదేళ్లలో ఆయన చేసిన ప్రగతిని ప్రజలకు వివరించారు. ఈ క్రమంలో ప్రత్యర్థులకు చెప్పుకోవడానికి ఏమీ లేక దిక్కు తోచని పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఓసీ ఓటింగ్‌ తక్కువశాతం వచ్చినా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఎక్కువశాతం వైఎస్సార్‌ సీపీ వైపే మొగ్గు చూపుతుండటంతో కాకినాడ రూరల్‌ అసెంబ్లీ, కాకినాడ పార్లమెంట్‌ నియోజకవర్గాల్లో కురసాల కన్నబాబు, చలమలశెట్టి సునీల్‌ల విజయం ఖాయమంటున్నారు. గతంలో చంద్రబాబు రైతు, డ్వాక్రా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినా సవాలక్ష నిబంధనలతో మొండిచెయ్యి చూపారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వాన్ని ఎలాగైనా ఓడించేందుకు కూటమి అమలుకు సాధ్యంకాని హామీలతో ముందుకు వచ్చినా గత అనుభవాల దృష్ట్యా ఆ కూటమిని నమ్మే పరిస్థితిలో ఓటర్లు లేరని అంటున్నారు. పవన్‌కళ్యాణ్‌ ఇంద్రపాలెంలో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి కన్నబాబును విమర్శించిన తీరు బాగోలేదని ప్రజలే కాకుండా ఆ పార్టీ నాయకులే అంటున్నారు. పవన్‌కళ్యాణ్‌ ప్రచారానికి వచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తోంది. సైలెంట్‌ ఓటింగ్‌ ఉందని ఆ పార్టీ నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. స్వతంత్ర అభ్యర్థుల పోటీ లెక్కలోకి రాదంటున్నారు. అంతర్మధనం ఎలా ఉన్నా అభ్యర్థులు తమ అనుచరులతో సామాజికవర్గాల వారీగా లెక్కలు వేసుకుంటూ గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.